సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9652278546

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

వైభవంగా ధనుర్మాస పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు



నిజరూపంలో వేంకటేశ్వర స్వామి

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం 25వ పాశురం విన్నపం జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో నిజరూపంలో దర్శనమిచ్చిన వెంకన్నకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు తిరుప్పావై ప్రవచనంలో పాల్గొన్నారు.

‘టీటీడీ ఘటనకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం’

పెందుర్తి: తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనకు ప్రభుత్వం, టీటీడీ యంత్రాంగమే కారణమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ షఫీఉల్లా ఆరోపించారు. తిరుమల చరిత్రలో ఎన్నడూ లేనంతగా జరిగిన ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమన్నారు. గురువారం పెందుర్తిలో ఆయన మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు భారీస్థాయిలో పరిహారం అందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుడి బంధువులకు ఆర్థిక సాయం అందిస్తున్న సర్పంచ్ సుజాత

పరవాడ: గత నెల 29న సముద్రంలో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు సముద్రంలో మునిగి మరణించిన ముత్యాలమ్మపాలెం శివారు దిబ్బపాలెం గ్రామానికి చెందిన కొవిరి మసేను కుటుంబానికి గ్రామ సర్పంచ్ చింతకాయల సుజాత రూ.25 వేలను ఆర్థిక సాయం అందించారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మృతుడికి రావలసిన ఎక్స్‌గ్రేషియాను మంజూరు చేయించడానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దేవి, మండల కో–ఆప్షన్ సభ్యుడు మైలపల్లి అప్పన్న, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

హెల్పర్‌కు స్వల్ప గాయాలు



చికిత్స పొందుతున్న అన్సారీ

పరవాడ: స్థానిక ఎస్ఈజెడ్‌లోని అలివేరా హెల్త్ ఏనిమాల్స్ పరిశ్రమలో వెల్డింగ్ పనులకు వెళ్లిన ఓ హెల్పర్ గాయపడ్డాడని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు. వివరాలివి.. అలివేరా పరిశ్రమలో జరుగుతున్న వెల్డింగ్ పనులను ఓ ప్రైవేట్ కాంట్రాక్టర్‌కు యాజమాన్యం అప్పగించింది. సదరు కాంట్రాక్టరు వెల్డింగ్ పనుల కోసం ఉత్తరప్రదేశ్ కుశినగర్ జిల్లా పద్నరోనా గ్రామానికి చెందిన జి.అన్సారీని నియమించి, బుధవారం ఉదయం పరిశ్రమకు తీసుకువెళ్లారు. అక్కడ వెల్డింగ్ పనుల అనంతరం సాయంత్రం ఇంటికి వెళ్లిన తరువాత అన్సారీ కడుపుపై బొబ్బలు కనిపించడంతో, ఆ విషయాన్ని కాంట్రాక్టర్‌కు తెలియజేశాడు. వెల్డింగ్ పనులు చేస్తున్న సమయంలో పరిశ్రమలో రసాయన చుక్కలు తన షర్ట్‌పై పడ్డాయని, ఇంటికి వచ్చిన తరువాత కడుపుపై బొబ్బలు మాదిరిగా కనిపించాయని చెప్పాడు. కాంట్రాక్టర్ అన్సారీని ప్రథమ చికిత్స కోసం అగనంపూడి ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారని, ప్రస్తుతం ప్రాణాపాయం లేదని సీఐ తెలిపారు. అయితే పరిశ్రమలో ఏ కెమికల్ పడిందన్న దానిపై విచారణ జరుపుతున్నామన్నారు.

సిరులు పొంగే కుండ





చక్రం(సారె) మీద కుండ తయారు చేస్తున్న కుమ్మరి



సంక్రాంతి కోసం సిద్ధమైన మట్టి కుండలు

- జోరుగా మట్టి పాత్రల విక్రయాలు
- సంక్రాంతి సంప్రదాయం.. మట్టి కుండ వంటకం
- రేయింబవళ్లు తయారు చేస్తున్న కుమ్మరులు

భోగి రోజు మట్టి కుండలో పాల పొంగులు.. సంక్రాంతి నాడు మట్టి పాత్రల్లో గుభాళించే వంటకాలు.. కనుమ రోజు మట్టి చట్టిలో వండే నాటుకోడి రుచులు.. ఇలా తెలుగు వారి పెద్ద పండగకు.. మట్టికి విడదీయలేని అనుబంధం.. ఆరుగాలం చెమట చిందించే రైతన్న కష్టానికి ప్రతిఫలంగా నేలతల్లి గర్భం నుంచి వచ్చే బియ్యపు గింజలు.. దానికి తోడుగా కొత్త బెల్లం, ఆవు పాలు, కుమ్మరి కష్టంతో తయారు చేసిన మట్టి కుండలో వేసి చేసిన పరమాన్నం సువాసనలతో పల్లె పరిమళిస్తుంది. పెద్ద పండగ రోజు పితృదేవతలకు నైవేద్యం మట్టిపాత్రల్లోనే సమర్పించడం ఆనవాయితీ. ఇలా.. సంక్రాంతి మూడు రోజులూ మట్టి పాత్రల ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. అందుకు అనుగుణంగా మట్టి పాత్రలు అందించేందుకు ఈ ఏడాది కూడా కుమ్మరి వృత్తిదారులు సిద్ధమయ్యారు. – పెందుర్తి


పల్లె పండగ సంక్రాంతి. ఆ మూడు రోజులూ ఎక్కడ చూసినా సందడే. ఉద్యోగాలు, వ్యాపారాల నిమిత్తం వివిధ ప్రాంతాల్లో స్థిరపడినవారు పెద్ద పండగకు పల్లెకు ముందుగానే వచ్చేస్తారు. వారి రాక కోసం గ్రామాలు ముస్తాబవుతున్నాయి. పండగకు కావలసిన ప్రతీ వస్తువూ ముందుగానే సిద్ధమవుతోంది. సంక్రాంతి పండగ సమయంలో మట్టి పాత్రలు, ప్రమిదలకు ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. అందుకే కుమ్మరి వృత్తిదారులు రేయింబవళ్లు కష్టపడి మట్టి పాత్రలను తయారు చేస్తున్నారు. ముఖ్యంగా సబ్బవరం, పెందుర్తి ప్రాంతాల్లో కుండలు, ప్రమిదలు అధికంగా తయారు చేస్తారు.

పండగలో విశేష ఆదరణ

సాధారణ రోజుల్లో ఎలా ఉన్నా సంక్రాంతి సమయంలో మట్టి పాత్రలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. అనాదిగా వస్తున్న సంప్రదాయాల ప్రకారం భోగి నాడు మట్టి కుండలో పాలు పొంగించడం..పెద్ద పండగ రోజున కలగూర సహా ప్రతీ వంటకం మట్టి పాత్రలో చేయడం.. కనుమ రోజు మాంసాహారాన్ని వండేందుకు మట్టి చట్టిలు వినియోగించడం పల్లెల్లో ఆనవాయితీ. ఆ క్రమంలో ఏటా పండగ సమయంలో మట్టి పాత్రలకు చక్కటి గిరాకీ ఉంటుంది. దాన్ని దృష్టిలో ఉంచుకుని పెందుర్తి కుమ్మరి కాలనీ, సబ్బవరం మండలం అంతకాపల్లి, ఇరువాడ, బలిజపాలెం, పరవాడ మండలం చింతలగొర్లివానిపాలెం గ్రామాల్లో కుమ్మరి వృత్తిదారులు మట్టి పాత్రల తయారీలో నెల రోజులుగా నిమగ్నమయ్యారు. ఆయా గ్రామాల్లో తయారు చేసిన మట్టి పాత్రలను ఇప్పటికే వారి కుటుంబ సభ్యులు గ్రామాల్లో తిరిగి అమ్మకాలు సాగిస్తున్నారు. సంక్రాంతికి ఆఖరి మూడు రోజుల ముందు అమ్మకాలు మరింత ఉండే అవకాశం ఉండడంతో ప్రస్తుతం కుమ్మర్లు ఎంతో కష్టపడి మట్టి కుండలు, ప్రమిదలు, ఇతర పాత్రలను తయారు చేస్తున్నారు.

ఇప్పుడే ఆదాయం

వాస్తవానికి ఒక్క పండగ పూటే కాకుండా సాధారణ రోజుల్లోనూ మట్టి పాత్రల్లో కట్టెల పొయ్యిపై వండే వంటకాలు రుచితో పాటు ఆరోగ్యాన్ని కూడా అందిస్తాయి. అయితే కాలంతో పాటు మనుషులు కూడా పరిగెట్టే రోజులు కావడంతో మట్టి పాత్రలకు మంగళం పాడేశారు. పండగ నాలుగు రోజులూ మట్టి పాత్రలకు ఉండే విపరీతమైన గిరాకీతో పోల్చితే సాధారణ రోజుల్లో కనీసం పదిశాతం కూడా ఉండదని తయారీదారులు వాపోతున్నారు. పండగ నాలుగు రోజులు అవసరానికి తగ్గట్టుగా మట్టి పాత్రలు తయారు చేసి తరువాతి రోజుల్లో కూలి పనులకు పోతామని చెబుతున్నారు.



సంక్రాంతి కోసం సిద్ధంగా ఉన్న ప్రమిదలు



సంక్రాంతి కోసం మట్టితో ప్రమిదలు తయారు చేస్తున్న పెద్దాయన

పండగ పూట మంచి ఆదాయం



సంకురాత్రి వచ్చిందంటే మాకు పని పెరుగుతుంది. మేం తయారు చేసిన కుండలు, ప్రమిదలు మా ఆడమనుషులు గ్రామాల్లో, సంతల్లో తిరిగి అమ్ముతుంటారు. రోడ్లపై దుకాణాలు పెట్టే వారు కూడా పెద్ద మొత్తంలో పాత్రలు మా దగ్గర పట్టుకెళ్తారు. పండగ కోసం జనానికి తగినట్టి పాత్రలు అందేలా రాత్రి పగలు కష్టపడి చక్రం మీద పాత్రలు తయారు చేస్తున్నాం.

– మానేపల్లి అప్పారావు, అంతకాపల్లి, సబ్బవరం

ఈ నెల రోజులే పని



సంక్రాంతి సమయంలో మట్టి కుండలకు ఎంతో గిరాకీ ఉంటుంది. పండగ నెల రోజులూ చాలా కష్టపడి తయారు చేస్తాం. కానీ మిగిలిన పద కొండు నెలలూ ఏదో చిన్నపాటి అవసరాలకు తప్ప మట్టి కుండల విక్రయాలు ఉండవు. రానురాను మా వృత్తిపై మా తరువాతి తరాలకు ఆసక్తి పోతోంది. ప్రభుత్వాలు కూడా ప్రత్యేకంగా మాకు ఏమీ చేయడం లేదు.

– గంగవరపు మహాలక్ష్మి, ఇరువాడ, సబ్బవరం

నేటి నుంచి సింహగిరిపై ధారోత్సవాలు



గంగధార వద్ద విద్యుద్దీపాలంకరణ

సింహాచలం: సింహగిరిపై శుక్రవారం నుంచి ధారోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు సింహాచలం దేవస్థానం అధికారులు, వైదికులు ఏర్పాట్లు చేశారు. సింహగిరిపై గంగధార వద్ద ఈ నెల 14 వరకు ఉదయం వేళల్లో ధారోత్సవాలు జరగనున్నాయి. గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తిని ఈ నెల 10, 11తేదీల్లో గంగధార వద్దకు తీసుకెళ్లి అభిషేకాలు నిర్వహించనున్నారు. అక్కడే తిరుప్పావై సేవాకాలం, పాశుర విన్నపం చేస్తారు. 12వ తేదీన గోదాదేవి, సువర్ణ అమ్మవారు, చతుర్భుజ తాయారు అమ్మవార్ల ఉత్సవమూర్తులను గంగధార వద్దకు తీసుకెళ్లి అభిషేకాలు నిర్వహిస్తారు. 13న గోదాదేవి, సువర్ణ అమ్మవారు, చతుర్భుజ తాయారు, శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను గంగధార వద్దకు తీసుకెళ్లి అభిషేకాలు నిర్వహిస్తారు. 14న స్వామివారి ఉత్సవమూర్తులు, మదన గోపాలస్వామి ఉత్సవమూర్తులు, గోదాదేవి, సువర్ణ అమ్మవారు, చతుర్భుజ తాయారు మూర్తులను తీసుకెళ్లి అభిషేకాలు నిర్వహిస్తారు. ఈ మేరకు గంగధార వద్ద విశేషంగా ఏర్పాట్లు చేశారు. విద్యుద్దీపాలంకరణ ఆకట్టుకుంటోంది.


నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం: సబ్బవరం సెక్షన్–1 పరిధిలోని 33/11 కేవీ సబ్బవరం సబ్ స్టేషన్‌లో న్యూ బ్రేకర్స్ నిర్మాణంలో భాగంగా పలు గ్రామాలలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో 33 కేవీ సబ్బవరం ఫీడర్ పరిధిలోని సబ్బవరం, తవ్వవానిపాలెం, అమృతపురం, గొల్లలపాలెం, పైడివాడ, అసకపల్లి, ఇరువాడ పంచాయతీల్లో ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

ఉత్తర ద్వార దర్శనానికి సర్వం సిద్ధం

వెంకటాద్రిపై ప్రత్యేక ఏర్పాట్లు

పెందుర్తి: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని వెంకటాద్రిపై అన్ని ఏర్పాట్లు చేశామని ఈవో నీలిమ తెలిపారు. వేకువజాము 4.30 గంటల నుంచి స్వామివారు ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిస్తారన్నారు. వేలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున వెంకటాద్రిపై ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. కొండ దిగువ నుంచి భక్తుల కోసం ఉచిత బస్ సదుపాయం కల్పించారు. క్యూలైన్లు, పందిళ్లు, షామియానాలు, తాగునీటి ఏర్పాట్లు చేశారు. ప్రైవేటు వాహనాలకు కొండపైకి అనుమతి లేదు. వెంకటాద్రిపై సేవకు వందలాదిగా వెంకన్న సేవకులు సిద్ధమయ్యారు.



వైకుంఠ ఏకాదశికి ముస్తాబైన వెంకటాద్రి

98వ వార్డులో..

సింహాచలం: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని 98వ వార్డులోని పలు ఆలయాలు ముస్తాబయ్యాయి. శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండదిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 5గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు వెంకన్న ఉత్తర ద్వార దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు. 98వ వార్డు సింహపురికాలనీలో ఉన్న రామాలయంలో ఉదయం 4.30నుంచి 10గంటల వరకు, అడవివరంలోని చంద్రాగార్డెన్స్‌లో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో రామచంద్రస్వామి ఉత్తర ద్వార దర్శనం ఉదయం 7.30గంటల వరకు భక్తులకు కల్పించనున్నారు.

నేత్రపర్వం.. పగల్‌పత్తు ఉత్సవం



తిరువీధిలో పాల్గొన్న భక్తులు, బేడా మండపంలో అప్పన్న ఉత్సవమూర్తుల తిరువీధి (ఇన్‌సెట్) వెంకన్న ఆలయంలో విశేష అలంకారంలో గోదాదేవి

- అప్పన్న ఆలయంలో ఘనంగా ముగిసిన వేడుకలు
- పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు
- నేటి నుంచి రాపత్తు ఉత్సవాలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో పది రోజులుగా జరుగుతున్న పగల్‌పత్తు ఉత్సవాలు గురువారంతో ఘనంగా ముగిశాయి. ఉదయం అయ్యవారి సేవలను విశేషంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను విశేషంగా అలంకరించి పల్లకిలో కొలువుదీర్చారు. ఆలయ బేడామండపంలో వైభవంగా తిరువీధి నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేటి నుంచి రాపత్తు ఉత్సవాలు

అప్పన్న ఆలయంలో శుక్రవారం నుంచి పదిరోజుల పాటు రాపత్తు ఉత్సవాలను విశేషంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఒక్కోరోజు ఒక్కో అలంకారంలో సింహగిరి మాడ వీధుల్లో స్వామికి తిరువీధి నిర్వహిస్తారు.

విశేషంగా ధనుర్మాస పూజలు

సింహగిరిపై ధనుర్మాసం పూజలను గురువారం కనులపండువగా నిర్వహించారు. తెల్లవారుజామున 3గంటలకు స్వామికి సుప్రభాత సేవ నిర్వహించారు. విశేష ఆరాధన, చతుర్వేద పారాయణం, ఉపనిషత్తు పారాయణం, తిరుప్పావై సేవాకాలం, సాత్తుమొరై, గోదాదేవికి బేడామండపంలో తిరువీధిని వైభవంగా నిర్వహించారు.

వెంకన్న ఆలయంలో..

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ధనుర్మాస పూజలను వైభవంగా జరిగాయి. గోదాదేవి అమ్మవారికి విశేష అలంకరణ చేసి వేదికపై కొలువుదీర్చి, పాశుర విన్నపం చేశారు. ఆలయ అర్చకులు భార్గవ్ తదితరులు ఈ పూజలు నిర్వహించారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే భారీ జరిమానా



రైతుబజార్‌లో ప్లాస్టిక్ వినియోగం నిషేధంపై అవగాహన కలిగిస్తున్న జెడ్సీ హేమావతి



చినముషిడివాడలో ప్లాస్టిక్ వలన నష్టం గురించి వివరిస్తున్న కార్పొరేటర్ వసంత

పెందుర్తి: ప్రతి ఒక్కరూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు స్వస్తి పలకాలని జోనల్ కమిషనర్ కె.హేమావతి పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు. స్థానిక రైతుబజార్‌లో ‘సే నో టూ ప్లాస్టిక్’ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ వినియోగదారులు, రైతులు ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని పూర్తిగా మానుకోవాలన్నారు. కాయగూరల కోసం ప్లాస్టికేతర సంచులను తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ రమణ, ఏఎంహెచ్‌వో అప్పలనాయుడు, ఈవో వి.ఎస్.పి. షర్మిల, సహాయకుడు ఎం.చిన్న తదితరులు పాల్గొన్నారు.

చినముషిడివాడలో..

జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడలో కార్పొరేటర్ శానాపతి వసంత ఆధ్వర్యంలో ‘సే నో టూ ప్లాస్టిక్’ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వార్డులోని ప్రజలు ప్లాస్టిక్‌కు స్వస్తి చెప్పాలని కోరారు. వార్డు నాయకుడు శానాపతి శంకర్రావు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

మురుగు, దుర్గంధానికి విముక్తి



కృష్ణరాయపురం వద్ద బీఆర్టీఎస్ రహదారిపై మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

పెందుర్తి: జీవీఎంసీ 94వ వార్డు కృష్ణరాయపురంలో బీఆర్‌టీఎస్ రహదారిపై ప్రవహిస్తున్న మురుగు నుంచి వాహనచోదకులకు విముక్తి కలిగింది. యూజీడీ పైప్‌లైన్ లీకై ప్రవహిస్తున్న మురుగుకు జీవీఎంసీ అధికారులు అడ్డుకట్ట వేశారు. ఇక్కడ రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తున్న తీరుపై సాక్షి దినపత్రిక ‘రోడ్డుపై యూజీడీ మురుగు’ అనే శీర్షికతో ఈ నెల 7న కథనం ప్రచురించింది. దీనికి స్పందించిన జీవీఎంసీ అధికారులు గురువారం బీఆర్‌టీఎస్ రోడ్డులో ఉన్న పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టారు. దీంతో వాహనచోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిటీ చైర్మన్ వెంకట పద్మలక్ష్మి

పరవాడ: ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా వైద్య సిబ్బంది పనిచేయాలని పరవాడ ఎంపీపీ.. పరవాడ, వాడచీపురుపల్లి ఆస్పత్రుల అభివృద్ధి కమిటీ చైర్మన్ పైల వెంకట పద్మలక్ష్మి అన్నారు. పరవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం నిర్వహించిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. వైద్య సేవల కోసం ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆస్పత్రులకు అవసరమైన మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ఆస్పత్రిలో రోగులు కూర్చునేందుకు అవసరమైన సిమెంట్ బెంచీల కొనుగోలు కోసం ప్రతిపాదనలు తయారు చేసి నివేదికను పంపాలన్నారు. మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సమావేశంలో తహసీల్దారు ఎస్.వి.అంబేద్కర్, పరవాడ, భర్నికం సర్పంచ్‌లు సిరపరపు అప్పలనాయుడు, పెదిశెట్టి పూజాశేఖర్, పరవాడ, వాడచీపురుపల్లి ప్రభుత్వ వైద్యాధికారులు పి.హారిక, జయశ్రీ కరిష్మా, క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

బంగారు ఆభరణాలు స్వాధీనం

- నిందితులకు రిమాండ్

గోపాలపట్నం : మూడున్నర తులాల బంగారు ఆభరణాలను రికవరీ చేసి, ఎయిర్‌పోర్టు పోలీసులు నిందితులను రిమాండ్‌కు పంపారు. ఎయిర్‌పోర్టు క్రైమ్ ఎస్ఐ సుదర్శన్ తెలిపిన వివరాలు లా ఉన్నాయి. పెందుర్తికి చెందిన లోకిరెడ్డి ప్రియాంక గత నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటలకు గాజువాక నుంచి పెందుర్తి వెళ్లేందుకు ఆటోలో బయలుదేరింది. ఎన్ఏడీ జంక్షన్‌లో దిగే సమయంలో బ్యాగు జిప్ తీసి ఉంది. బ్యాగులో ఉన్న మూడున్నర తులాల బంగారం వస్తువులు లేక పోవడంతో ఆటోలో వ్యక్తులు గురించి ఆరా తీశారు. గాజువాకలో గుర్తు తెలియని ఇద్దరు మహిళలు ఆటో ఎక్కారని, వారు మాటల్లో పెట్టి బ్యాగులో ఉన్న రెండు గాజులు, లాకెట్‌తో ఉన్న ఒక చైన్, మూడు చెవి దిద్దులు దొంగలించి ఉంటారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పోలీసులు దర్యాప్తు చేయగా ఆటోలో ప్రియాంకతో పాటు రావుల పార్వతి, గంగమ్మ ప్రయాణించినట్టు గుర్తించారు. వీరిద్దరూ పాత నేరస్తులు కావడంతో విచారణ చేయగా వస్తువులు అపహరించినట్టు అంగీకరించారు. దీంతో వీరిని అరెస్టు చేసి బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.



నిందితులతో క్రైమ్ ఎస్ఐ సుదర్శనరావు

అక్రమ అరెస్టులపై సీపీఎం నిరసన



నిరసన తెలియజేస్తున్న ఉప్పాడ సత్యవతి తదితరులు

సబ్బవరం: ప్రధాని నరేంద్ర మోదీ విశాఖ పర్యటనలో భాగంగా మండలంలోని సీపీఎం నాయకులు, కార్యకర్తల అక్రమ అరెస్టులకు నిరసనగా పార్టీ గురువారం ర్యాలీ నిర్వహించింది. ఈ సందర్భంగా సీపీఎం మండల నాయకురాలు ఉప్పాడ సత్యవతి మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల చేస్తామని మోదీ స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బర్ల రమణ, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ముందే వచ్చిన సంక్రాంతి

భగభగ మండే భోగి మంటలు.. హరివిల్లే ఇల చేరినట్లున్న రంగవల్లికలు .. ముచ్చట గొలిపే గొబ్బెమ్మలు.. హరిదాసుల సంకీర్తనలు .. ఆకట్టుకునే బొమ్మల కొలువు.. చిన్నారుల భోగిపళ్ల వేడుకలతో తెలుగు వారి సంక్రాంతి పండుగ ముందే వచ్చిందా అన్నట్లుగా దర్శనమిచ్చింది. విద్యాలయాల్లో గురువారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు సంప్రదాయ వేషధారణలో కనువిందు చేశారు. – పెందుర్తి/సింహాచలం/సబ్బవరం



సుజాతనగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు, పాఠశాల ప్రతినిధులు



సింహాచలం దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాలలో భోగి మంట వద్ద విద్యార్థినుల ఆటపాటలు



ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో సంక్రాంతి అతిథులతో సంప్రదాయ వేషధారణలో విద్యార్థులు



సబ్బవరం ఆర్కిడ్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో భోగి మంటల వద్ద విద్యార్థుల సందడి